
కథ

# అన్వేషణ

— పెండెం సత్యనారాయణ





టాక్సీ దిగి గేటు తెరుచుకొని వస్తున్న నన్ను ఎదురుకొని, సూటుకేసు అందుకున్నాడు రాజ్.

'ఇప్పుడేనా రావడం, బాబాయ్'! వాడి ప్రశ్నకు చిరునవ్వుతో తలూపాను. రోటీన్‌గా వేసే ప్రశ్నలు ఎంత అనవసరమో అన్పిస్తుంది.

'ఏం బాబాయ్ నీలో నువ్వే నవ్వుకొంటున్నావ్' అన్న రాజ్ ప్రశ్నకు మళ్ళీ నా నవ్వే జవాబైంది. కదిపితే చాలు కబుర్లతో కరిగిపోయే నేను మౌనంలో పడి ఉండడం వాడికి ఆశ్చర్యకరమైంది.

'బాగా అలసిపోయినట్టున్నావ్ బాబాయ్. కాఫీ తెస్తానుండు ఈలోగా స్నానం చేసిరా' అంటూ రాజ్ కిచెన్‌లోకి వెళ్ళాడు.

రాజ్ మా అన్న కొడుకు. నాతోపాటే వుంటూ పాలిటెక్నిక్ చేస్తున్నాడు. చురుకైనవాడు. సాహిత్యం అన్నా, సంగీతమన్నా అభిరుచి. ఆ విషయాల్లో చర్చలు లేవనెత్తి నా బ్రెయిన్ తింటుంటాడు అప్పుడప్పుడు! స్నానం చేసి వచ్చి కుర్చీలో వాలిపోయాను. తెలుగు లెక్చరర్‌ని కాబట్టి పుస్తకాలు బాగా చదువుతాను, సంగీతాన్ని ఇష్టపడుతానంటాడు రాజ్ నాగురించి కథలు రాసి పత్రికలకు పంపని నా బద్ధకాన్ని ఆట పట్టించడం మా వాడి హాబీ.

నాకో కాఫీ కప్ ఇచ్చి, వాడొకటి సిప్ చేస్తూ ఎదురుగా కూర్చున్నాడు. కాఫీ త్రాగుతూనే ఆలోచనల్లో పడిపోయాను ప్రయాణబడలిక, నీరసం- సాయంత్రపు సంధ్యవేళ, ఇప్పుడు నిద్రేమిటి? తల వెనక్కి వాల్చాను.

చాలా నెమ్మదిగా, ఆత్మీయంగా రాజ్ ప్రశ్నాపరంపర మొదలు పెట్టాడు. ''బాబాయ్! మిమ్మల్ని ఎన్నో రోజులనుండి ఒక విషయం అడగాలనుకుంటున్నాను. మీరు ప్రతి ఏడూ, ఇదే నెలలో సిమ్లాకెళ్ళి ఐదారురోజులుండి వస్తుంటారు. వెళ్ళేప్పుడు ఉత్సాహంగా, చలాకీగా వెళ్తారు. వచ్చేప్పుడు మాత్రం ఎందుకింత నీరసం, నిస్తేజాలతో తిరిగివస్తారు. కారణం ఏమిటి? చెప్పు బాబాయ్ నాలాగే అందరూ అనుకుంటున్నారు కానీ మిమ్మల్ని అడగడానికి జంకుతున్నారు. ఈ మూడేళ్లుగా మిమ్మల్ని గమనిస్తున్న నాకు ఇక భరించే శక్తి లేకే అడుగుతున్నాను. చొరవ చూపినందుకు ఏమనుకోవు కదా బాబాయ్'' నాకళ్లలోకి సూటిగా చూస్తూ అడుగుతున్నాడు రాజ్!

ఏదో కదలిక, గుండెపొరల్లో, కళ్ళల్లో నీటి తెర. గుండెలోతుల్ని తాకే టట్లు ఇలా నన్ను అడిగిన వాళ్లు లేరు. ఏమని చెప్పను వీడికి! చెప్పడం ఉచితమా? సందేహాలతో కళ్ళు మూసుకున్నాను.

రాజ్ నిరాశగా వెళ్లి పోతున్న అడుగుల చప్పుడు...

నా ఆలోచనలు స్మృతి పథంలో వెనక్కి...

కరిగిపోయిన రంగుల కలదృశ్యాలు...

★★★

నేను హైస్కూల్ టీచర్‌గా పని చేసేరోజులు... ఆ సంవత్సరం యునైటెడ్ స్కూల్ ఆర్గనైజేషన్ వాళ్లు 'యునైటెడ్ స్కూల్ ఫెస్టివల్' ను న్యూఢిల్లీలో నిర్వహిస్తున్నారని, మా స్కూల్లో కొత్తగా చేరిన టీచరొకరు చెప్పారు. మా టీచర్లంతా ఢిల్లీ వెళ్ళడానికి నిర్ణయించి అన్ని బాధ్యతలూ నామీదే వేసేశారు నమ్మకంగా.

ఢిల్లీ వేళ్ళేదారిలో ఎదురయ్యే ముఖ్యప్రదేశాలన్నింటిని చూడవచ్చని అందరం నాలుగు, ఐదు రోజుల ముందే బయల్దేము. ఢిల్లీ చేరేప్పటికి ఇంకా మూడురోజులుంది స్కూల్ ఫెస్టివల్.

అందరు ఎక్కడికెళ్ళాలా అని చర్చల్లో పడితే 'సిమ్లా' వెళ్దామని నేనే ప్రపోజ్ చేశాను. ఒక మెటాడోర్ అద్దెకు తీసుకొని ఢిల్లీ, చండీగడ్ తదితర ప్రదేశాల్ని చూస్తూ సిమ్లా చేరాం. లాడ్జిలోబస. తెల్లవారాక సిమ్లా పట్టణమంతా తిరిగి చూసాం. తిరుగు ప్రయాణంలో సిమ్లా నుండి చాలా 150 కి.మీ వచ్చే సాక డ్రైవర్ కొద్దిసేపు వ్యాను నిలిపాడు. అలసిపోయిన మిత్రులంతా నిద్రలో విశ్రాంతి తీసుకుంటున్నారు.

నాకు ప్రయాణంలో నిద్రరాదు. ప్రయాణంలో కిటికీ దగ్గర కూర్చుని ప్రవహించిపోయే దృశ్యాల్ని చూడ్డం నాకెంతో ఇష్టం. ఇలా నిద్రపోయేవాళ్ళని చూస్తే నాకు జాలి అనిపిస్తుంది. కిటికిలోంచి ప్రకృతి సౌందర్యం నిజమైన ఫోటోలాగా నీలాకాశం నీడలలో ప్రకృతి హరితాంబరం ధరించి సోయగంగా నిల్చుంది. దృశ్యాలొక్కొక్కటి కళ్ళద్వారా హృదయంలో నిండిపోయి అనుభూతులై ద్రవిస్తున్నాయి. కమ్మని పాట విన్నా, అందమైన దృశ్యాల్ని చూసినా హృదయం పులకరించిపోతుంది. శరీరమంతా తన్మయ భావనలు, పులకరింతలు!! ఇంత అద్భుత సౌందర్యమే ప్రకృతిలో లేకపోతే మానవజీవితమెంత రసహీనమో కదా!

హిమచల్‌ప్రదేశ్, కాశ్మీర్ వలెనే సముద్రమట్టానికి చాలా ఎత్తయిన ప్రదేశం-ఉన్నతమైన పర్వతాలు, కొండలోయలతో నిండి-ఎక్కడా మైదానాలు విశాలమైనవి కన్పించవు. ఎన్నిరకాల వృక్షసంపద, టేకు, సాల, పైన్. ఆపిల్ చెట్లతో- భూమీమ్మది ఆకు పచ్చదనమంతా తనలోనే దాచుకున్నట్లుంటుంది ఈ రాష్ట్రం. సిమ్లాకూడా! రోడ్లన్నీ ఎత్తు, పల్లాలతో, ప్రక్కనేలోతైన అగాధాలతో గుగుర్పాటు కల్గించే ప్రయాణ మార్గం.

అందరూ వెహికిల్ దిగారు. చెట్లనీ చూస్తూ పక్షుల కిలాకిలా రావాల్ని వింటూ మధ్య మధ్య కన్పించే ఆకాశాల్ని గమనిస్తూ నడుస్తున్నారు. పచ్చటి చెట్లవెనకాల కొండల వెనక జారిపోతున్న ఎర్రటి సూర్యుడు.

హఠాత్తుగా నా కళ్ళల్లో మెరుపులు!

ఒకరూపం ఎర్రని దుస్తులతో ఆచెట్ల మధ్యనుండి వస్తోంది. నేను చాలా దూరంలో వున్నట్లున్నాను మా వాళ్ళకి. నాకు ఎవరి మాట వినపడడం లేదు.

పాల మీగడ లాంటిముఖం, విశాలమైన నీలి కళ్ళు ఆ పడగాటి ముక్కే ఆమె అందాన్ని మరింత ద్విగిణీకృతం చేస్తుంది. దగ్గరగా వచ్చాక ఆరూపం ఒక స్త్రీమూర్తిదని తెల్సింది. పాలరాతి శిల్పం వంటి అమె తలమీద గడ్డిమోపు, నడుస్తుంటే వినవస్తున్న అమె కాలిగజ్జెల సవ్వడి. చేతిలో కొడవలి ప్రక్కన నడుస్తున్న పదేళ్ల పిల్లవాడితో మాట్లాడుతూ వస్తుందామె. మధ్య మధ్య నవ్వుతున్నప్పుడల్లా పలు వరుస తళుక్కు మంటోంది. కెంపుల్లాంటి సొట్టలు పడే బుగ్గలు. ఉండి లేని నడుం--ఓహ్! అద్భుత సౌందర్యం.

దగ్గరగా వచ్చేదాకా ఆమె నన్ను చూడనేలేదు. గాజుల సవ్వడి, గలగలా నవ్వువిన్పించి కలలోంచి మేలుకున్నట్లనిపించింది నాకు. నా చూపుల్లోని పిచ్చితనాన్నో, ఆనందాన్నో, ఆరాధనో చూసిందికాబోలు వెంట వచ్చిన పిల్లవాడికి నన్ను చూపిస్తూ అదే పనిగానవ్వుతోంది.- ఇంత నిర్మలంగా, నిర్భయంగా, తదేకంగా నన్నే చూస్తుంటే నాకళ్ళు వాలిపోయి ఆమె పాదాల మీద వాలాయి. మళ్ళీ తలెత్తి చూసినా, ఆమె అలానే నవ్వుతుంది నన్ను చూస్తూ. నేనూ చూస్తు నిల్చిపోయాను. పేరడగాలనుకుని పెదవులు కదల్చానో లేదో ఆమె ఏదో అన్నది ముందుగా. ఆ భాష నాకర్థం కాలేదు. కాని, ఆగొంతులోని మాధుర్యం పరవశున్ని చేసింది.

'నాపేరు శరశ్చంద్ర' అన్నాను. అర్థం కానట్లు చూసింది. అంతలోనే ఏదోతోచినట్లు కోకిలస్వరంతో మాటలు కూడాదీసుకుంటూ 'శరశ్చంద్ర' అంది.

నా సంతోషానికి అవధుల్లేవు. నా పేరు నాకే తీయగా అన్పించింది. నా పేరింత బాగుంటుందని నాకే తెలియదు. 'ఆ అవును నా పేరు శరశ్చంద్ర అన్నాను. మరోసారి ఆకోకిల 'నా పేరు పలికింది. తేనెలూరినట్లుగా- నాకు తెలిసిన అన్ని భాషల్లో ఏమేమో అన్నాను తనతో. ఆమెకు నా మాటలేవి అర్థం కాలేదు. అరే, ఏం చేయను? ఇద్దరి భాషలు ఇద్దరికి అర్థంకావడంలేదు. ఎలా? సంతోషం స్థానంలో సంవేదన, ఆర్తి చోటు చేసుకున్నాయి. ఆత్రుత, ఆందోళన హృదయం ఆక్రోశిస్తుంది. ఎలా, ఎంచేయాలిపుడూ.

దూరంగా మా వ్యాన్ హారన్

ఆమె ముఖంలో కూడా ఏదో చెప్పాలనే తపన, ఆరాటం కన్పిస్తున్నాయి.

ఆమె జాలిగా, దీనంగా చూస్తోంది. ఏమో చెప్పాలనే ప్రయత్నం ఏమీ వినపడడంలేదు. 'మధుమతి' అనే మాట తప్ప. ఎంత అందమైన పేరు.

'మధుమతి' అందీ మళ్ళీ... హరన్ అదే పనిగా మ్రోగుతోంది. ఫటూ పాలు పోని పరిస్థితి. అనూహ్యంగా చేతులు సాచాను. అకస్మాత్తుగా ఆమె చేతులు తామర మొగ్గల్లా నా అరచేతుల్లో ఇమిడిపోయాయి. చటుక్కున చేతుల్ని ముద్దాడాను. పులకరించి పోతున్నట్లు ఆమె కళ్ళు వాలిపోయాయి. బరువుగా కనురెప్పలెత్తి చూసిన చూపుల్లో అనురాగం, ఆప్యాయత, ఆరాధన రంగరించి నట్లు కన్పించాయి.

ఈ సారి హారన్‌కాదు. స్నేహితుని పిలుపు. ఇపుడే, ఇక్కడే ఈమె సాన్నిధ్యంలోనే, ఈ మధురస్పర్శతోనే మరణిస్తే ఎంత బాగుండేది? మహోన్నత సౌందర్యం ముందు, ప్రేమైకమూర్తి ముందు కరిగిపోవడం కన్నా భాగ్యమేముంది?

హారన్ మోత స్నేహితుల పిలుపులు!..

ఈ ప్రియదర్శినిని, ఈ అమృతప్రేమ వర్షిణిని ఎలా వదిలికదిలేది? వుండిపోతే, సాధ్యమా? ఉండిపోవాలి. ఉంటాను.

స్నేహితుల అలికిడి చేరువైంది.

చటుక్కున చేయి వదిలాను. గుండెను పెరికి వేసిన బాధ. తలతెగినప్పటి వేదన. కాని, ఆమె నా చేయి వదల్లేదు. ఆ కళ్ళల్లో ఏదో నిరాశ!

మమ్మల్ని కలిపిన సంధ్యాసూర్యుడు మా వియోగాన్ని చూడలేనట్లు కొండల చాటుకు వెళ్లిపోయాడు. ఆమె కళ్ళల్లో నీలి నీడలు, ముఖం మీద నల్లని మబ్బులు, అడుగులు వెనక్కివేస్తోంది.

పడిపోతుందేమోనని 'అమ్మో' అంటూనే నేనుముందుకెళ్లేలోగా వెంటనున్న పిల్లవాడు ఆమెచేయందుకొని ముందుకు తీసుకెళ్లాడు.

పచ్చటి ప్రకృతి నల్లని చీకట్లు క్రమ్ముకుంది. నా హృదయంలో కూడా!

నిశ్చేష్టుణ్ణై, నిల్చుండిపోయాను ఆమె తిరిగి చూస్తోంది. ఆ పిల్లవాడు లాక్కువెళుతున్నాడామెను. చేరువైనట్లుగానే ఆమె దృశ్యంలా కనుమరుగై పోయింది. నా కళ్లల్లో కన్నీరామె రూపాన్ని సరిగా గమనించనీయడం లేదు. పెదవులదురుతున్నాయి.

భుజం మీద ఎవరిదో చెయ్యి పడింది. ముందుకు వచ్చిన నన్ను ఆశ్చర్యంగా చూస్తున్నారు నా మిత్రులు. ఏమిటన్నట్లుగా కళ్ళెగరేసారు.

'మధుమతి' అన్నాను. 'మధుమతేమిటని' మతి పోలేదుకదా! అంటూ భుజాలు పట్టి ఊపుతున్నారు. బదులివ్వక పోయే సరికి బలవంతంగా లాక్కెళ్లి వ్యాన్‌లో వేసారు. అందరేం అడిగారో, నేనేం చెప్పానో, నకే తెలియదిపుడు.

ఇప్పటికీ ఆమె రూపం కళ్ళల్లో మెదులుతూనే ఉంది.

మళ్ళీ సంవత్సరం వెళ్ళాను. సిమ్లాలో వారం రోజులుండి అక్కడ లోయల్లో తారాగాను. అమె కన్పించలేదు.

అప్పటి నుండి నా సిమ్లా యాత్ర సాగుతూనే ఉంది 'మధుమతి' అన్వేషణలో.

వెళ్లడం, వెతకడం, నిరాశతో తిరిగిరావడం ఇలా జరుగుతూనే ఉంది.

ఆత్రంగా వెళ్ళడం ఆర్తిగా రావడమే ఫలితం. ఇన్నాళ్లు.

★★★

రాజ్‌కు చెప్పలేకపోయిన నా గతం నా మనస్సు తెరమీద దృశ్యమానం అయింది.

ఆమె నాలాగే నా కోసమే ఎదురు తెన్నులు కాస్తూబ్రతుకుతుందో.

అలా కాకుండా, కళకళలాడుతూపిల్లా పాపలతో చల్లగా సంసారం చేస్తూ ఉండాలి. అలాగే కావాలి నాలా కాకుండా-

'బాబాయ్' అంటూ రాజ్ పిలుపు.

లేచాను.